## ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు అనుమతించాలి

- టీటీడీకి బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు సూచన



హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): తిరుమలలో శ్రీవారి దర్శనానికి తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు పంపుతున్న సిఫార్సు లెటర్లను ఫిబ్రవరి 1 నుంచి అనుమతిస్తామని బోర్డులో తీర్మానం చేసినట్టు గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 294 మంది ఎమ్మెల్యేలు పంపిన సిఫార్సు లేఖలను పరిగణనలోకి తీసుకుని వసతి కల్పించడంతోపాటు, బ్రేక్ దర్శనానికి అనుమతి ఇచ్చారని చెప్పారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యేలకు పరిమితం చేయడం ఏంటని ప్రశ్నించారు.

## 'సీతారామ భూసేకరణ'ను పూర్తిచేయాలి

- ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలి
- అధికారులకు నీటి పారుదల మంత్రి ఉత్తమ్ ఆదేశాలు



హైదరాబాద్, మార్చి14 (నమస్తే తెలంగాణ): సీతారామ ప్రాజెక్టుకు భూసేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్ట్ పనుల పురోగతిపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి మంత్రి ఉత్తమ్ చర్చించారు. సత్తుపల్లి ట్రంక్, సీతారామ ప్రాజెక్ట్ పురోగతి, భూసేకరణ, ఖర్చు, నాణ్యత, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. సత్తుపల్లి ట్రంక్ పనులు, పంప్‌హౌస్-4 నిర్మాణాన్ని ఈ ఏడాదిలో పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ పనుల్లో సమస్యలు ఎదురైతే వెంటనే సమాచారం అందించాలని, సీతమ్మసాగర్ బరాజ్ నిర్మాణాన్ని రాబోయే మూడేళ్లలో పూర్తిచేయాలని సూచించారు.

# కస్టడీలో నిందితుడి మృతి!

- పోలీసులు కొట్టడమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ
- నిజామాబాద్‌లో ప్రభుత్వ జిల్లా దవాఖాన ఎదుట ఆందోళన
- గుండె పోటుతోనే మరణించాడని పోలీస్ కమిషనర్ ప్రకటన
- మృతుడు సంపత్ శరీరంపై బలమైన గాయాలు ఉన్నాయి,
- సిట్టింగ్ జడ్జితో విచారించాలి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సంపత్‌ను పోలీసులే కొట్టి చంపారని ఆరోపిస్తూ నిజామాబాద్‌లోని జీజీహెచ్ ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, చిత్రంలో మోహరించిన పోలీసులు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ)/వినాయకనగర్: నిజామాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల కస్టడీలో ఓ నిందితుడు గురువారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం వివాదంగా మారింది. పోలీసులు కొట్టడంవల్లే నిందితుడు చనిపోయాడని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రభుత్వ జిల్లా దవాఖాన ముందు ఆందోళనకు దిగారు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా అంతర్గాంకు చెందిన సంపత్ (32) జగిత్యాల జిల్లాలో మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ ద్వారా నిరుద్యోగులను థాయ్‌లాండ్, మయన్మార్, లావోస్ తదితర దేశాలకు పంపిచాడు. విదేశాలకు వెళ్లిన యువకులు తాము మోసపోయామని తిరిగి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిజామాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు సంపత్‌తో పాటు మరో ఏజెంట్‌పై పదిరోజుల క్రితం కేసు నమోదుచేశారు. ఇద్దరినీ అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా కోర్టు రిమాండ్ విధించింది. నిందితులను విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేయడంతో ఈ నెల 12 నుంచి 14 వరకు మూడు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. నిందితులను సైబర్‌క్రైమ్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. దర్యాప్తులో భాగంగా గురువారం జగిత్యాలలో సంపత్ కన్సల్టెన్సీ ఆఫీసుకు తీసుకెళ్లారు. లావాదేవీలు, రికార్డులను పరిశీలించారు. రాత్రి నిజామాబాద్ సీసీఎస్‌కు తరలించారు.

### స్టేషన్ లాకప్‌లో ఏమైంది?

గురువారం రాత్రి 10 గంటలకు ఛాతిలో నొప్పిగా ఉన్నదని, చేయి లాగుతున్నదని సంపత్ తెలిపాడని పోలీసులు చెప్తున్నారు. హుటాహుటిన జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా, సంపత్ చికిత్స పొందుతూ కాసేపటికే మృతి చెందినట్టు తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్టు వెల్లడించారు. శుక్రవారం ఉదయం నిజామాబాద్‌కు చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు దవాఖాన ఎదుట బైఠాయించారు. పోలీసులు తీవ్రంగా కొట్టడంతోనే సంపత్ మృతి చెందాడని ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి అక్కడకు చేరుకుని కుటుంబ సభ్యులతో చర్చించారు. అనుమానముంటే ఫిర్యాదు చేయాలని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

### సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: జాన్‌వెస్లీ

పోలీసు కస్టడీలో నిందితుడు సంపత్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వానికి జాన్‌వెస్లీ లేఖ రాశారు. పోలీసులు చిత్రహింసలు పెట్టడంతోనే అతడు చనిపోయాడని, సంపత్ శరీరంపై తీవ్రమైన గాయాలు ఉన్నాయని జాన్‌వెస్లీ చెప్పారు.

### అనారోగ్యంతోనే మృతి

పోలీస్ కస్టడీలో సంపత్ అనారోగ్యంతోనే మరణించాడని నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఓ ప్రకటనలో వెల్లడించారు. దవాఖాన లోపలికి సంపత్ నడుచుకుంటూ వెళ్లాడని, ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఘటనపై మానవ హక్కుల కమిషన్‌కు నివేదిక అందించామని వివరించారు.

# చేనేతలకు లక్షలోపే రుణమాఫీ!

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తున్నామని, అందుకోసం రూ.33 కోట్లు విడుదల చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో నిర్వహించిన అఖిల భారత పద్మశాలీ సంఘం మహాసభలో పాల్గొన్న ఆయన, ఈ మేరకు ప్రకటన చేసిన విషయం తెలిసిందే. 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 మధ్యకాలంలో రుణం పొందిన వారికి మాత్రమే మాఫీ జరిగినట్టు జీవోలో పేర్కొన్నారు. దీంతో చేనేత, పవర్‌లూమ్ కార్మికుల్లో కలవరం మొదలైంది. రూ.లక్ష లోపు వారికి మాత్రమే రుణమాఫీ చేస్తే, లక్ష దాటిన వారి పరిస్థితి ఏమిటని సర్కారును నిలదీస్తున్నారు. రూ.లక్షకు ఒక్క రూపాయి ఎక్కువైనా రుణమాఫీ చేయడం లేదని చేనేత కార్మిక సంఘాల నాయకులు గగ్గోలు పెడుతున్నారు. బ్యాంకర్లు కూడా ఇదే విషయం చెబుతున్నట్టు పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 30 వేల మందికిపైగా చేనేత కార్మికులు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోగా, అధికారంలోకి రాగానే రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి సుమారు 15 నెలల పాటు ఆలస్యం చేసింది. దీంతో బ్యాంకుల ఒత్తిడికి కొంతమంది చేనేత కార్మికులు తలొగ్గి బయట అప్పులు చేసి రుణాలు తీర్చారు. ఇక మిగిలిన వారికి మాత్రమే ఇప్పుడు రుణమాఫీ వర్తిస్తున్నట్టు చెబుతుండడంతో రుణాలు చెల్లించిన వారి పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. అసలు రుణమాఫీ బ్యాంకుల నుంచి పొందిన అసలుకా? వడ్డీతో కలిపి మొత్తానికి చేస్తారా అనేది తెలియాల్సి ఉందని పేర్కొంటున్నారు. రుణమాఫీకి సంబంధించిన అంశాలపై క్లారిటీ ఇవ్వాలని, అందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు చెరుకు స్వామి, పవర్‌లూమ్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కూరపాటి రమేశ్ డిమాండ్ చేస్తున్నారు.

## జూలైలో పంచాయతీ ఎన్నికలు జరిగేనా?

- నేటికీ కొలిక్కిరాని బీసీలకు 42 శాతం రిజర్వేషన్
- 2024 ఫిబ్రవరి 1న ముగిసిన పాలకవర్గాల గడువు
- నిబంధనల ప్రకారం ఇప్పటికే 14 నెలలు ఆలస్యం
- సకాలంలో ఎన్నికలు జరుగక నిలిచిన కేంద్ర నిధులు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జూలైలో అయినా జరుగుతాయా అనే అనుమానం కలుగుతున్నది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చి 15 నెలలైనా రిజర్వేషన్ల ప్రక్రియను రేవంత్ సర్కారు కొలిక్కి తీసుకురాలేకపోయింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన వివిధ అభివృద్ధి నిధులు నిలిచిపోయాయి. ఫలితంగా గ్రామీణ సంక్షేమానికి తీవ్ర విఘాతం కలుగుతున్నది.

### గ్రామాల్లో నిధుల కొరత..

రాష్ట్రంలో గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ పాలకవర్గాల పదవీకాలం ఇప్పటికే ముగిసింది. నిరుడు ఫిబ్రవరి 1న సర్పంచుల పదవీకాలం ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. ఆర్టికల్ 243ఈ(3)ప్రకారం.. ప్రతి ఐదేండ్లకు ఒకసారి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి. గ్రామపంచాయతీ పాలకవర్గం గడువు ముగిసేలోపు లేదా పాలకవర్గం రద్దయిన ఆరు నెలల్లో ఎన్నికలు పూర్తిచేయాలి. కానీ, గ్రామపంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసి 14 నెలలు కావస్తున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంపై కేంద్ర పంచాయతీరాజ్ వ్యవహారాలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తాజాగా ఆందోళన వ్యక్తంచేసింది. ఎన్నికల ఆలస్యంతో గ్రామాభివృద్ధి ప్రాజెక్టులు, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు నిలిచిపోయాయని తెలిపింది.

### బీసీల రిజర్వేషన్‌పై మల్లగుల్లాలు

కులగణన నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టో ప్రకటించింది. ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కుల సర్వే నిర్వహించింది. గణాంకాలను అసెంబ్లీలో ప్రకటించింది. 3.1 శాతం(16 లక్షల) జనాభా సర్వేలో పాల్గొనలేదని వెల్లడించింది. సర్వే గణాంకాలపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌తోపాటు బీజేపీ, ప్రజాసంఘాలు, కుల సంఘాలు, మేధావులు తీవ్ర అభ్యంతరాలు తెలిపారు. రీ సర్వేకు డిమాండ్ చేశారు. దీంతో సర్కారు ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు మళ్లీ కులగణన వివరాల నమోదుకు అవకాశం కల్పించింది. 15 వేల లోపు కుటుంబాల వివరాలు మాత్రమే సేకరించగలిగింది. ఈ గణాంకాలపై ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. అప్పుడే 42 శాతం రిజర్వేషన్లపై బిల్లు పెడతామని, పార్లమెంట్‌లో ఆమోదం కోసం పంపిస్తామని చేతులు దులుపుకున్నది.

## ప్రభుత్వ కార్యాలయం నుంచి ఫైళ్ల తరలింపు

**సెలవు రోజు రాత్రి వేళ సీనియర్ అసిస్టెంట్ నిర్వాకం**

ములుగు, మార్చి 14 (నమస్తేతెలంగాణ): ప్రభుత్వ కార్యాలయం నుంచి గుట్టుచప్పుడు కాకుండా రాత్రి సమయంలో ఫైళ్లను తరలించిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలోని పే అండ్ అకౌంట్స్ కార్యాలయంలో శుక్రవారం చోటుచేసుకున్నది. ములుగు పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయ కాంప్లెక్స్‌లో ఉన్న పే అండ్ అకౌంట్స్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శుక్రవారం రాత్రి తన కారులో వచ్చి అటెండర్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తుల సహాయంతో సుమారు 30కి పైగా ఫైళ్లను ఆఫీసు బయటకు తీసుకొచ్చారు. రోడ్డుపై తెల్లటి క్లాత్‌లో కట్టి కారులో ఎక్కిస్తుండగా అటుగా వెళ్లిన 'నమస్తే తెలంగాణ' ఫైళ్ల తరలింపుపై ప్రశ్నించింది. ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ సార్ ఉన్నారని, ఆయన ఆదేశాల మేరకే కారులో పెడుతున్నట్టు అటెండర్ తెలిపాడు. సదరు అధికారి వద్దకు వెళ్లి వివరణ కోరగా తమకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని, మార్చి నెలలో ఆడిటింగ్ ఉన్నందున ఫైళ్లను ములుగులోని తన గదికి తీసుకెళ్తున్నట్టు చెప్పారు. హోలీ పండుగ సెలవు రోజున, అదీ రాత్రి వేళ ఎందుకు ఫైళ్లను తరలిస్తున్నారని అడిగితే దాటవేసే ప్రయత్నం చేశారు. సంబంధిత కార్యాలయ జిల్లా అధికారి సమక్షంలో ఫైళ్లను తరలించాల్సి ఉండగా అటెండర్ సహాయంతో తరలించడం పలు అనుమానాలకు తావిస్తున్నది.



ములుగు పే అండ్ అకౌంట్స్ ఆఫీస్ నుంచి రాత్రి 8 గంటలకు ఫైళ్లను తరలిస్తున్న అటెండర్, మరో ఇద్దరు వ్యక్తులు

## మయన్మార్ సైబర్ రాకెట్‌లో 8 మంది సభ్యుల అరెస్టు

**సీఎస్‌బీ డీజీ శిఖా గోయెల్ వెల్లడి**



హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): మయన్మార్ సైబర్ నేరగాళ్ల ముఠాలోని మొత్తం 15 మంది ఏజెంట్లు, మధ్యవర్తుల్లో 8 మందిని అరెస్టు చేసినట్టు సీఎస్‌బీ డీజీ శిఖా గోయెల్ ఓ ప్రకటనలో వెల్లడించారు. మిగిలినవారు పరారీలో ఉన్నారని, వారిలో ఐదుగురు విదేశాల్లో ఉన్నారని వివరించారు. తెలంగాణ వ్యాప్తంగా 10 మంది బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ ముఠాపై 9 కేసులు నమోదైనట్టు తెలిపారు.

## యువకుడికి గాయాలు

మూసాపేట(అడ్డాకుల), మార్చి 14 : రోడ్డుప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన ఘటన చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. కర్నూల్‌కు చెందిన మౌలానా శుక్రవారం కర్నూల్ నుంచి హైదరాబాద్‌వైపు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో కందూరు వాగువంతెనపైకి రాగానే డివైడర్‌ను ఢీకొని తీవ్రగాయాలైనట్లు తెలిపారు. అంబులెన్స్‌లో దవాఖానకు తరలించారు.


**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on X @SCRailwayindia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

PUB/0262/25

ఇ-టెండర్ కోరుతూ ప్రకటన (https://ireps.gov.in ద్వారా)

దిగువ పనుల కోసం భారత రాష్ట్రపతి తరపున SC & CE/C-V/SC, కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్, ద.మ. రైల్వే, సికింద్రాబాద్ వారు ఇ-టెండర్ కోరుతున్నారు.

క్ర.సం. 1: **NIT No. 05-CAO-C-SC-2025,** తేది: 13.03.2025 **పనిపేరు:** SCR కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్-బల్హార్షా-కాజీపేట-విజయవాడ స్టేషన్ల మధ్య ఎలక్ట్రిఫికేషన్‌తో 3వ లైన్ ప్రతిపాదన-(ఎ) కాజీపేట్ యార్డ్ మోడిఫికేషన్స్: మట్టిపని, దుప్పటి వేయడం, వంతెన పనులు చేపట్టడం, కొత్త హైలెవెల్ ప్లాట్‌ఫారం (HLPF-4&5), కొత్త కవర్ ఓవర్ ప్లాట్‌ఫారం (COP) నిర్మాణం, ఇప్పటికే ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ (FOB) పొడిగింపు, SSE నిర్మాణం. ఉత్తరం: బ్రిడ్జి ఆఫీస్, సర్వీస్ బిల్డింగ్‌తో SPART & SPARMV షెడ్ల నిర్మాణం, మరియు కాజీపేట్ స్టేషన్ యార్డ్ మోడిఫికేషన్‌కు సంబంధించి ఇతర సివిల్ పనులు (ఫేజ్-II పనులు) (బి) కాజీపేట డీజిల్ లోకో షెడ్: కాజీపేట డీజిల్ లోకోషెడ్‌లో వీల్ పార్కింగ్ షెడ్ కొరకు కనెక్ట్ చేయబడిన పి.వే పనులు సహా వీల్ పార్కింగ్ షెడ్, టాయిలెట్ కాంప్లెక్స్ యొక్క నిర్మాణం (సి) బెల్లంపల్లి స్టేషన్ వద్ద కొత్త కవర్ ఓవర్ ప్లాట్‌ఫారం (COP) నిర్మాణం మరియు మందమర్రి స్టేషన్ వద్ద కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ (FOB) నిర్మాణం. **వివరాలు: అంచనా వ్యయం:** రూ. 36,91,86,214.17, **బయానా:** రూ.19,95,900.00, **పూర్తిచేయు కాలం:** 12(పన్నెండు) నెలలు. **తెరుచు తేది:** 08.04.2025న 15.00 గం.లు.

క్ర.సం. 2: **NIT No. 06-CAO-C-SC-2025,** తేది: 13.03.2025 **పనిపేరు:** SCR కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్-నాందేడ్ డివిజన్-పర్భని నుండి పర్లి స్టేషన్ల వరకు ట్రాక్ యొక్క ప్రతిపాదిత డబ్లింగ్‌కు సంబంధించి కి.మీ. 297.150 నుండి 298.85 (1.70 కి.మీ.లు) వద్ద గంగాఖేడ్ యార్డ్‌లో ప్రతిపాదిత యార్డ్ ఏర్పాట్లు: నిర్మాణంలో భూమి పనిని అమలు చేయడం, మైనర్ బ్రిడ్జిల యొక్క నిర్మాణం, FOB, RBG రూములు టవర్ కార్ షెడ్, SSP, గూడ్స్ ప్లాట్ ఫారం, హై లెవెల్ ప్లాట్‌ఫారం, బల్లాస్ట్ సేకరణ, పి.వే. మెటీరియల్స్ యొక్క రవాణా, ట్రాక్ వేయడం మరియు అనుసంధానించడం మరియు ఇతర సంబంధిత పనులు మొదలైనవి. **వివరాలు: అంచనా వ్యయం:** రూ. 48,21,38,976.45, **బయానా :** రూ.25,60,700.00, **పూర్తిచేయు కాలం:** 12(పన్నెండు) నెలలు. **తెరుచు తేది:** 03.04.2025న 15.00 గం.లు.

(i) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కొరకు వెబ్‌సైట్ **https://ireps.gov.in** కు లాగిన్ అవ్వండి. (ii) టెండర్ సమర్పణ వ్యవధిలో టెండరుదార్లు తమ ఆఫర్లను ఆన్‌లైన్ లోసమర్పించవచ్చు. ఇది టెండర్ ముగింపుకు ముందు పదిహేను రోజుల వ్యవధి. (iii) టెండర్ దాఖలు కాలం ప్రారంభ తేదీ వరకు ఏదైనా సవరణ (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడింది) కోసం టెండరుదార్లు చూడాలి.

**చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్/నిర్మాణం/ సికింద్రాబాద్**

A0333

**తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి.**




మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సాంబశివాలయం వద్ద హోలీ సంబురాల్లో పాల్గొన్న చిన్నారులు, యువతులు పాల్గొన్న దృశ్యం



నారాయణపేట రూరల్ : జాజాపూర్‌లో హోలీ ఆడుతున్న చిన్నారులు

## హోలీ సంబురాల్లో రెండు వర్గాల మధ్య ఘర్షణ

గద్వాల అర్బన్, మార్చి 14 : హోలీ సంబురాల్లో రెండువర్గాల మధ్య ఘర్షణ జరిగిన ఘటన శుక్రవారం చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల మేరకు.. జిల్లా కేంద్రంలోని తెలుగుపేట, వడ్లవీధికి చెందిన కొంత మంది యువకులు హోలీ సంబురాలు ని ర్వహిస్తూ నదీఅగ్రహారం సమీపంలో ఘ ర్షణ పడ్డారు. అనంతరం రెండువర్గాల వా రు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సాయంత్రం గద్వాల పోలీస్‌స్టేషన్ వెళ్తున్న క్రమంలో స్టేషన్ ఎదుటే మాజీ కౌన్సిలర్ ఆధ్వర్యంలో రెండు వర్గాల యువకులు మ రోమారు తీవ్రస్థాయిలో ఘర్షణ పడ్డారు. ఘర్షణ వాతావరణ పరిస్థితిని గమనించిన పోలీస్‌లు రెండువర్గాల యువకులను చెదరగొట్టి పరిస్థితిని అదుపుచేశారు. అనంతరం రెండువర్గాల వారు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డీఎస్పీ మొగిలయ్య టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని పరిస్థితిపై సమీక్షించారు.

## సెక్టోరల్ అధికారికి సన్మానం

నారాయణపేటరూరల్,మార్చి14ః పేట జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో ఇటీవల సెక్టోరల్ అధికారిగా నియామకమైన సురేశ్‌ను శుక్రవారం పతంజలి యోగా సమితి సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

## యువతికి సన్మానం

అయిజ రూరల్, మార్చి 14 : మండలంలోని సంకాపురం గ్రామానికి చెందిన పాలాతి ఈశ్వరన్న కుమార్తె నీలవేణి ఇటీవల జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య శుక్రవారం గ్రామానికి వెళ్లి నీలవేణిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింహచారి, వీరేశ్, ఈశ్వరన్న, జయ్యన్న పాల్గొన్నారు.



నీలవేణిని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య

# అక్రమ రవాణాకు.. అధికారులే అండదండలు!

- యథేచ్ఛగా మట్టి, బియ్యం అక్రమ రవాణా
- సమాచారం అందించినా పట్టించుకోని అధికారులు
- నేను వస్తున్నా, మీరు వెళ్లిపోండి అంటూ తిరిగి అక్రమార్కులకు సమాచారం అందిస్తున్న అధికారులు

గద్వాల అర్బన్, మార్చి 14 : జిల్లాలో మట్టి, ఇసు క, బియ్యం అక్రమ రవాణాకు ప్రభుత్వ అధికారులే.. పూర్తి అండదండలు అందిస్తునట్లు పెద్దమొత్తంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి సమయం అయిందంటే చాలు.. అక్రమార్కులు తెల్లవారుజాము వరకు మట్టి, ఇసుక, బియ్యం అక్రమంగా తరలిస్తూ పెద్దమొత్తంలో డబ్బులు పొగుచేస్తున్నట్లు సమాచారం. ఈ మధ్య అక్రమార్కులకు ప్రభుత్వ అధికారులే పూర్తిఅండదండలు...తాము చేసే అక్రమ పనికి ప్రభుత్వ అధికారులకు కూడా లెక్క పంపిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. రెండు రోజులుగా జిల్లాలో కొన్నిప్రాంతాల్లో మట్టి అక్రమ రవాణా పెద్ద మొత్తంలో తరలుతున్న అరికట్టాల్సిన అధికారులే.. ఆ వైపు పోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టి తరలించే మాఫియా నుంచి నెలనెలా మాములు అధికారులకు వస్తున్నట్లు సమాచారం. అయితే ఈ క్రమంలో జిల్లాలోని కర్నాటక బార్డర్ సమీపంలోని ఓ మండలంలో రేషన్ బియ్యంను మాఫియా పట్టపగలే తరలించినట్లు తెలిసింది. రేషన్‌బియ్యం అక్రమంగా కర్నాటక రాష్ట్రానికి తరలిస్తున్నారని స్థానికులు ప్రభుత్వ అధికారులకు సమాచారం అందిస్తే స్పందించాల్సిన అధికారులే.. పట్టించుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి పట్టించుకోలేదని 100 కాల్ చేసి స్థానికులు సమాచారం అందించినట్లు సమాచారం. 100 కాల్‌కు వచ్చిన ఫోన్ సమాచారాన్ని తీసుకున్న సదరు అధికారి తీరా.. బియ్యం మాఫియాకు ఫోన్‌చేసి మీరు బి య్యం తరలిస్తున్న విషయం తెలుసుకొని నాకు ఫోన్ చేస్తున్నారు..నేను...వస్తున్నా.. మీరు అక్కడినుంచి పారిపోండి... నేను వస్తున్నా... అలాంటి పని చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోకుడాద... అంటూ బియ్యం మాఫియాకు సదరు అధికారి హెచ్చరించిన్నట్లు సమాచారం. అలాగే ఇసుక తరలించే ట్రాక్టర్‌లు అధికారులకు పట్టుపడకుండా నెలనెలా రూ.10వేల నగదు నెల మాములు లెక్కన ఇవ్వాలని అధికారితో ఓ రాజకీయ నాయకుడు చర్చలు జరిపి ఒప్పందాలు చేసినట్లు సమాచారం. అలాగే అధికార పార్టీకి చెందిన ఓ మాజీచైర్మన్ తన పలుకుబడిని ఉపయోగించుకొని తన టిప్పర్‌లతో రాత్రి సమయంలో అక్రమంగా గద్వాల మండలంలోని ఆయా ప్రాంతాలలోని గుట్టలను గుట్టుగా కరిగేస్తున్నట్లు సమాచారం.ఆ మాజీ చైర్మన్ టిప్పర్‌లను అధికారులు పట్టికుని క్షణాలలో వదిలేస్తున్నట్లు సమాచారం. అధికారులు పట్టుకుంటే నేరుగా.. అధికారికి ఫోన్‌చేసి టిప్పర్‌లు ఎవరివో.. మీకు తెలువాదా.. అంటు ఘాటుగా ప్రశ్నించేలోపు అధికారులు టిప్పర్‌లను వదిలేస్తునట్లు తెలిసింది. ఈ మట్టి, ఇసుక, బియ్యం అక్రమ వ్యవహారంపై డీఎస్పీ మొగిలయ్యను వివారణ కోరగా.. మట్టి, ఇసుక, బియ్యం అక్రమ రవాణా చేసే వారి వివరాలు నేరుగా తనకే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. నేను స్పెషల్ టీంను పంపి మట్టి, ఇసుక, బియ్యం తరలించే వారిని పట్టుకొని చర్యలు తీసుకుంటాం. అక్రమంగా తరలించే వారిని ఎవరిని ఉపేక్షించేది..లేదు.. అలాగే మట్టి, ఇసుక, బియ్యం మాఫియతో సత్సంబంధాలు నడిపే అధికారులపై కూడా నిఘా పెడుతాం.

## తుంగభద్ర నదిలో అరుదైన నీటి కుక్కలు

అలంపూర్, మార్చి 14 : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూరులోని ప్రసిద్ధ క్షేత్రం సమీపంలో తుంగభద్ర నదిలో అరుదైన నీటి జీవులు కనిపించాయి. శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్లిన కొందరు యువకులకు నదిలో కొత్త రకం జీవులు కనిపించడంతో ఆసక్తిగా వీడియోలు తీశారు. సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారాయి. అక్కడే మత్స్యకారులను విచారించగా.. అవి నీటి కుక్కలని, చాలా అరుదుగా కనిపిస్తుంటాయన్నారు. నీటిలో చేపలను తింటూ జీవనం సాగిస్తాయని తెలిపారు.



తుంగభద్ర నదిలో కనిపించిన నీటి కుక్కలు

## గోదాంలో ధాన్యం నిల్వలు

అమరచింత, మార్చి 14 : ధాన్యంను 10వేల మేట్రిక్ టన్నుల వరకు నిల్వలు చేసుకునేందుకు కేసీఆర్ పాలనలో దివంగత గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ సాయిచంద్ చొరవతో ధర్మాపూర్‌లో రూ.10కోట్లతో నిర్మాణం చేపట్టిన గోదాంను పూర్తిచేసి ప్రజాపత్రినిధులతో ప్రారంభం చేయకముందే అధికారులు అందులో రెండు రోజులుగా ధాన్యం నిల్వలను ఏర్పాటు చేస్తున్నారు. సన్నబియ్యాన్ని ఉన్నతాధికారుల ఆదేశంతో మహబూబ్‌నగర్ గోదాంల నుంచి ఇక్కడి తరలించి నిల్వలు చేస్తున్నట్లుగా అధికారులు తెలిపారు.

## వైద్యసిబ్బంది నిర్లక్ష్యంతో మూడునెలల బాలుడు మృతి

**మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలో ఘటన**



మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల మృతి చెందిన బాలుడు

మహబూబ్‌నగర్, మార్చి 14 : మెరుగైన వైద్య సేవలు అందుతాయని వచ్చిన ఓ కుటుంబానికి పుత్రశోకం మిగిల్చిన ఘటన మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖానలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం చిన్నవడ్డేమాన్ గ్రామానికి చెందిన నరేశ్, పవిత్ర దంపతులకు చెందిన మూడు నెలల బాలుడు అనారోగ్యానికి గురయ్యాడు. వైద్య సేవల నిమిత్తం వారు రెండు రోజుల కిందట బాబును మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానకు తీసుకువచ్చి అడ్మిట్ చేశారు. అక్కడ జలుబు, దగ్గుతో పాటు ఆయాసం ఉందని తల్లిదండ్రులు వైద్యులకు తెలుపగా, వారు వైద్యసేవలు అందించడంలో అలసత్వం ప్రదర్శించారు. అదే విధంగా బాబు పరిస్థితి బాగుందని ఇంటికి తీసుకెళ్లండని చెప్పారు. అయితే తల్లిదండ్రులు మాత్రం మా బాబు ఇంకా అనారోగ్యంగానే ఉన్నాడు చూడండని చెప్పినా వారు పట్టించుకోలేదు. ఈ క్రమంలో గురువారం ఉదయం బాబు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులకు తెలుపగా వారు వచ్చి పరీక్షించే సమయానికి బాబు అపస్మారక స్థితిలో వెళ్లాడు. సీపీఆర్ చేసినా ఫలితం లేకపోవడంతో బాబు మృతి చెందాడు. అయితే వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మా బాబు మృతిచెందాడని బాలుడు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్నా ఎస్పీఎఫ్ పోలీసులు వచ్చి బాధిత కుటుంబ సభ్యులతో మీకు ఏమైనా అనుమానం ఉంటే బాబు మృతదేహానికి పోస్టుమార్టం చేస్తాం అని తెలపడంతో పుట్టెడు శోకంతో ఉన్న తల్లిదండ్రులు పోస్టుమార్టం అవసరం లేదని బాబు మృతదేహాన్ని తీసుకొని గ్రామానికి వెళ్లిపోయారు. అయితే మాకు జరిగిన అన్యాయం ఇంకెవ్వరి జరగడానికి వీలులేదని జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత దవాఖాన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయంపై దవాఖానకు సూపరింటెండెంట్‌కు సైతం ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అధ్యాపకులు

మహ్మదాబాద్, మార్చి 14 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా నూతనంగా 8మంది అధ్యాపకులు నియమితులైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, గణితం, భౌతిక శాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, చరిత్ర సబ్జెక్టులకు వీరిని కేటాయిస్తున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారన్నారు.